నేడు పులివెందులకు జగన్ రాక

ప్రజాశక్తి- పులివెందుల టౌన్ : మాజీ ముఖ్యమంత్రి, వైసిపి నేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం పులివెందులకు రానున్నారు. ఈనెల 25, 26 తేదీల్లో రెండు రోజులపాటు పులివెందులలో పర్య టించనున్నారు. 25 న తాడేపల్లి నుంచి హెలికాప్టర్ ద్వారా పులివెందులలో నిభాకరాపురం హెలిపాడ్‌కు 11.45 కి చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటలకు తన నివాసానికి చేరుకొని అనంతరం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుంటారు. రాత్రికి పులివెందులలోనే ఉండి 26న ఉదయం 10 గంటలకు రాజారెడ్డి ఆస్పత్రి స్థానంలో కొత్తగా నిర్మించిన ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రిని ప్రారంబిస్తారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా బెంగళూరుకి బయలుదేరుతారు. మాజీ సీఎం పర్యటన ప్రాంతాలను బందోబస్తులో భాగంగా అర్బన్ సిఐ నరసింహులు పరిశీలించారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వకపోతే

దశలవారీగా ఆందోళనలు

- రైతుల సమావేశాలను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గం
- పరిహారం ఇవ్వకపోతే రోడ్డు పనులను అడ్డుకుంటాం
- తహశీల్దార్ కార్యాలయాలను ముట్టడిస్తాం
- ధర్నాలో ఎపి రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల హెచ్చరిక



ఆందోళన చేస్తున్న ఎపి రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు, రైతులు

ప్రజాశక్తి - బ్రహ్మంగారి మఠం

మైదుకూరు నియోజవర్గంలో నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలో భూములు కోల్పోతున్న రైతుల అందరికీ నష్టపరిహారం పూర్తిస్థాయిలో చెల్లించకపోతే దశలవారి పోరాటాలకు శ్రీకారం చుడతామని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, అన్వేష్ సోమవారం హెచ్చరించారు. మల్లేపల్లి సచివా లయం ఎదుట రైతులతో వారు ధర్నా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్ల కిందట రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న వారం దరికీ నష్టపరిహారం చెల్లిస్తామని, పూర్తి స్థాయిలో చెల్లించిన తర్వాతనే రోడ్డు పనులు ప్రారం భిస్తామని గ్రామ సభలు పెట్టి అధికారులు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రోడ్డు పనులు ప్రారంభించినా నష్టపరిహారం రైతుల ఖాతాలో పూర్తిస్థాయిలో జమ చేయలేదని వారు అన్నారు. రైతులు నష్టపరిహారం కోసం రోడ్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌ను, పనులను అడ్డుకుంటామని హెచ్చ రించారు. రైతులు అంటే స్థానిక బి.మఠం పోలీస్ యంత్రాంగం చులకనగా ఉందని పేర్కొన్నారు. రైతులపై బైండోవర్ కేసులు పెడతామని బెదిరి ంచడం సరెంది కాదని వారు తెలిపారు. రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తే ఆ సమావేశానికి స్థానిక బి.మఠం ఎస్ఐ చంద్రశేఖర్ వచ్చి పర్మిషన్ లేకుండా సమావేశం ఎట్లా జరుపుతారని, వీలుకాదని సమావేశానికి వచ్చిన రైతులందరినీ పంపించడం చాలా అన్యాయమని వారు తెలిపారు. తక్షణమే నేషనల్ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు కాంట్రాక్టర్, తహశీల్దార్ చర్చించి రైతులకు నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సునీల్ కుమార్‌తో పాటు రైతులు, గురయ్య, నారాయణ, భీముడు, అరవింద్ పాల్గొన్నారు.

బి.మఠం ఎస్ఐపై చర్యలు తీసుకోండి

- హోం మంత్రికి ఎపి రైతు సంఘం విజ్ఞప్తి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

బ్రహ్మంగారిమఠం ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని హోం మంత్రి వంగలపూడి అనితకు సోమవారం ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. బెంగళూరు-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులను చాపాడు, మైదుకూరు, బి.మఠం, పోరుమామిళ్ల మండలాలకు చెందిన 25 మంది రైతులకు చెందిన 300 ఎకరాలకు పరిహారం చెల్లించకుండా చేపడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతుల నుంచి పొలాలను తీసుకుందని, పరిహారం చెల్లించకుండా కాంట్రాక్టర్ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారని వాపోయారు. ఎపి రైతు సంఘం కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బి.మఠం మండలంలోని మల్లేపల్లి గ్రామంలో 25 మంది రైతులతో కూడిన సమావేశాన్ని అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. 144 సెక్షన్ అమల్లో ఉందని, రైతులపై కేసులు నమోదు చేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. సామాన్యులకు, రైతులకు రక్షణ కల్పించాల్సిన ఎస్ఐ, కాంట్రాక్టర్ పక్షం వహించి భూములు కోల్పోయిన రైతులపై దౌర్జన్యం చేస్తున్నాడని పేర్కొన్నారు. రైతుల, రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాలపై కేసులు పెడతామని పెట్రేగిపోతున్నాడని వివరించారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యతిరేక వైఖరిని అవలంభిస్తున్న ఎస్ఐ తీరుపై విచారణ చేసి కఠినచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలోనూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని బెదిరించారని తెలిపారు. రైతుల కోసం పోరాడుతున్న రైతు సంఘాల నాయకులపై కూడా దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. ఎస్ఐ వ్యవహార సరళిని గమనిస్తే శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉందని, ఇటువంటి అధికారుల తీరు కారణంగా ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగే అవకాశం ఉందని, నిష్పక్షపాతంగా విచారణ చేసి కఠినచర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయడానికి కృషి చేయాలని వివరించారు. మంగళవారం ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జిల్లా కలెక్టర్, ఎస్‌పిలను కలిసి బి.మఠం ఎస్ఐ వ్యవహార సరళిపై ఫిర్యాదు చేయనున్నట్లు తెలుస్తోంది.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ మనోజ్‌రెడ్డి అన్నారు. సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో కడప నగరపాలక సంస్థ వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో నగరపాలక శాఖాధిపతులు, ఇతర అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28 అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు. వీటిని సంబంధిత విభాగం వారు పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.
అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్ రెడ్డి

మురుగు కాలువలను శుభ్రం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కార్పొరేషన్ కమిషనర్ మనోజ్ రెడ్డి ఆదేశాల మేరకు మలేరియా విభాగ సిబ్బంది అశోక్‌నగర్, ఎన్‌జిఒ కాలనీ, మామిళ్ళపల్లి, ఖలీల్ నగర్ ప్రాంతాలలో మలేరియా పారిశుధ్య కార్మికులతో పెద్ద డ్రైన్‌ల నుంచి పూడికలు, చెత్తాచెదారాలు తీసివేయు కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలో శంకరాపురం, బెల్లం అండి, శాస్త్రి నగర్, చినమాచిపల్లి, మోచంపేట, ఎపి హెచ్‌పి కాలనీల ప్రాంతాలలో దోమల నివారణ కోసం మలేరియా విభాగం పారిశుధ్య కార్మికులు స్ప్రేయింగ్ చేశారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో ప్రజలు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎఎస్‌పి (అడ్మిన్) కె. ప్రకాష్ బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో ఫిర్యాదు దారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులకు పోలీస్ సిబ్బంది సహాయం చేసి ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. కార్యక్రమంలో డిటిసి ఎస్‌పి అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదు

ప్రజాశక్తి - కడప : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కమలాపురం మండలం లేటపల్లి గ్రామానికి చెందిన షేక్ మాబు తాను వృద్ధుడనని, గ్రామంలో తకు నివాసగృహం ఉందని, తన పెద్ద కుమారుడు ఇంటి నుండి వెళ్ల గొట్టాడని తన ఇంటిని తనకు ఇప్పించి న్యాయం చేయాలని అభ్యర్థించారు. కలసపాడు మండలం ముదిరెడ్డిపల్లి గ్రామానికి జె. రమాంజనేయ రెడ్డి ప్రభుత్వ చౌక దుకాణాన్ని ముదిరెడ్డిపల్లికి మార్చాలని కోరారు. కడప కేంద్రానికి చెందిన ఎస్. అయేషా తన కుమార్తె అంగవైకల్యంతో ఉందని పెన్షన్ ఇప్పించాలని వేడుకున్నారు. కడప అక్కాయపల్లికి చెందిన శ్రీనివాసులు ఆచారి వృధ్యాప్య పింఛను మంజూరు చేయాలని విజ్ఞప్తి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, ఎస్‌డిఇ వెంకటపతి, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కంటి కేన్సర్‌పై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి - కడప అర్బన్ : కంటికి కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని ఎల్‌విపిఇఐ వైద్యులు డాక్టర్ కావ్య మాధురి బెజ్జంకి అన్నారు. సోమవారం ఎల్.వి ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ డాక్టర్ వైఎస్ఆర్ ప్రాంగణంలో 'కంటి కేన్సర్ సవాళ్లు, చికిత్స' అనే అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా మంది కేన్సర్లు ఊపిరితిత్తులు, రొమ్ము, లేదా చర్మానికి సంబంధించినదని అనుకుంటారని, కానీ కళ్లను కూడా ప్రభావితం చేస్తుందన్నారు. కంటి కేన్సర్ అరుదయినప్పటికీ, త్వరితంగా గుర్తించకపోతే అది ప్రాణాంతకం కావచ్చు చెప్పారు. శాశ్వతంగా చూపు పోవడానికి, కంటిని పూర్తిగా తీసివేయడానికి దారితీయవచ్చన్నారు. దురదృష్టవశాత్తూ, అవగాహనా లోపం చాలా కేసులు తీవ్రమైన దశలో గుర్తించబడటానికి దారితీసుందని చెప్పారు. పిల్లలలో ప్రాణాంతకమైన కంటి కేన్సర్లు రెటీనోబ్లాస్టోమా ఇతర దేశాలకంటే భారతదేశంలో ఎక్కువగా ఉందన్నారు.

భయంతోనే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు : ఎంపీ

ప్రజాశక్తి - కడప : ప్రజల సమస్యలను ఎక్కడ ప్రశ్నిస్తామో అన్న భయంతో ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని కడప వైసిపి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి అన్నారు. 44వ డివిజన్ బాలాజీ నగర్‌లో సీతా రామ లక్ష్మణ ఆంజనేయ స్వామి నూతన ఆలయ ప్రతిష్ట కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పులివెందుల అభివృద్ధి చెందలేదని టిడిపి నాయకులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజల సౌకర్యార్థం మెడికల్ కళాశాల నిర్మిస్తే వద్దు అని లేఖ రాయడం విడ్డూరమని వాపోయారు. .రాష్ట్రాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసిన నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమే అని చెప్పారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఇస్తే ప్రజా సమస్యలను వివరంగా చెప్పేందుకు వీలు ఉంటుందన్నారు. ఎమ్మెల్యేగా అయితే కేవలం రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడేందుకు అవకాశం ఇస్తారని చెప్పారు. పులివెందులకు ఉప ఎన్నిక వస్తుందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఉప ఎన్నిక పెట్టాలంటే కేవలం పులివెందులే కాదు కుప్పం, మంగళగిరి, పిఠాపురం నాలుగు స్థానాల్లో జరపాలి అన్నారు. కేవలం 9 నెలల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజల్లో పూర్తి వ్యతిరేకత తెచ్చుకొంది అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చాలేదని పేర్కొన్నారు.

జగన్ ప్రతిపక్ష హోదా అడగడం అజ్ఞానం : డిసిసి

ప్రజాశక్తి - కడప : జగన్ ప్రతిపక్ష హోదా అడగడం అజ్ఞానమని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి అన్నారు. జగన్‌కు ప్రతిపక్ష నాయకుడి హోదా ఇవ్వాలని వైసిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ ప్రసంగం సందర్భంగా నినాదాలు చేయడం, వాక్ అవుట్ చేయడం అవివేకం, మూర్ఖత్వమన్నారు. సోమవారం కడప కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసినలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ నిబంధనలు, సంప్రదాయాల ప్రకారం ఒక పార్టీకి ప్రతి పక్ష పార్టీ హోదా ఇవ్వాలంటే మొత్తం అసెంబ్లీ సభ్యుల సంఖ్యలో 10 శాతం శాసన సభ్యులు ఆ పార్టీకి ఉండాలన్నారు. ఆ ప్రకారంగా వైసిపికి 18 మంది ఎమ్మెల్యేలు ఉండాలని, కానీ 11 మంది మాత్రమే ఉన్నారని, ఇన్ని తెలిసి కూడా వైసిపి నాయకులు పదేపదే ప్రతిపక్ష హోదా అడగడం సమంజసం కాదని విజయ జ్యోతి అన్నారు.

మోడల్ స్కూల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని ఎపి మోడల్ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ పాఠశాల ప్రిన్సిపల్ సౌజన్య తెలిపారు. ఈనెల 25 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలు రూ. 75, ఇతరులు రూ. 150 చెల్లించాలన్నారు. మార్చి 31 చివరి తేదీ అని తెలిపారు. దరఖాస్తు దారులకు ఏప్రిల్ 20న రాత పరీక్ష ఉంటుందన్నారు. రాత పరీక్షలో మెరిట్ వచ్చిన వారి పేర్లు నోటీస్ బోర్డ్‌లో ఏప్రిల్ 27న ప్రదర్శిస్తారన్నారు.

ఎస్‌టి వర్గీకరణ అమలు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎస్‌టి వర్గీకరణ అమలు చేయాలని యానాదుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు నీలం సురేంద్ర కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెసి అదితి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఎస్‌సి వర్గీకరణ అమలు చేయాలని ఆదేశించిందని పేర్కొన్నారు. అధికారులు ఎస్‌టి వర్గీకరణ అమలు చేశాలా చూడాలని కోరారు. రాష్ట్రంలో 10 లక్షల మంది జనాభా ఉన్న యానాదులు విద్య, ఉద్యోగ, ఆర్థికపరంగా చాలా వెనకబడి ఉన్నారని తెలిపారు. ఎస్‌టి వర్గీకరణ జరిగితే తమకు రావాల్సిన సంక్షేమ పథకాలు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు అందుతాయని చెప్పారు. వినతి పత్రం అందించిన వారిలో జిల్లా చైర్మన్ మేకల చెంగయ్య, గిరిజన నాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి చర్యలు : జెసి

ప్రజాశక్తి - కడప అర్బన్ : విభిన్న ప్రతిభావంతుల విద్యా అభివృద్ధి కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. సోమవారం సభాభవన్ వద్ద విభిన్న ప్రతిభావంతులు హిజ్రాలు , వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డిగ్రీ లేదా ఆపై తరగతులు చదువుతున్న 13 మంది విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూఈ ల్యాప్‌టాప్‌లు వారి విద్యా ప్రయాణంలో సహాయపడతాయని తెలిపారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఆర్.వి. క్రిష్ణ కిషోర్, వారి సిబ్బంది, లబ్దిదారుల తల్లిదండ్రులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

- జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

ప్రజాశక్తి - కడప

ప్రతి మహిళా ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కలిగి ఉండాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సభాభవన్‌లో ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు సందర్భంగా 'ఆర్థిక ప్రణాళిక, సేవింగ్, రిస్క్ మేనేజ్మెంట్, ఆర్థిక వృద్ధి కోసం రుణ సదుపాయాలు' అంశాలపై భారతీయ రిజర్వ్ బ్యాంకు వారు ప్రచురించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం అనేది భారతీయ రిజర్వ్ బ్యాంకు ద్వారా ప్రతి సంవత్సరం కీలక అంశాలపై కల్పిస్తుందని చెప్పారు. ఈనెల 28 వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తారని అన్నారు .ప్రతి మహిళ బాధ్యతాయుతంగా రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిర్ణీత సమయానికే రుణాలు చెల్లించి మంచి క్రెడిట్ స్కోర్ పొందాలన్నారు. తెలివిగా నడుచుకుంటూ, ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని సూచించారు. ముఖ్య అవసరాలను సరిగ్గా గుర్తించాలని అన్నారు. నెలసరి బడ్జెట్‌ను ప్లాన్ చేసుకొని పొదుపు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్, అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జెసి, డిఆర్ఒ, అధికారులు

అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - బద్వేలు

గత ఏడాది నిర్వహించిన 42 రోజుల రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక కోటవీధిలోని గల బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో వాగ్దానాలను అమలు చేయాలని మార్చి 10న విజయవాడలో నిర్వహించ తలపెట్టిన మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడిచిన హామీలు అమలు చేయలేదని వాపోయారు. సొంత పెట్టుబడులు పెట్టి సెంటర్‌లు నిర్వహిస్తున్నారని, రకరకాల యాప్‌ల పేరుతో అంగన్వాడీలపై పనిభారం పెరిగిందని పేర్కొన్నారు. అంగన్వాడీలకు కేంద్ర ప్రభుత్వం 2014 సంవత్సరం నుండి వేతనాలు పెంచలేదని, 2022లో సుప్రీంకోర్టు అంగన్వాడీ వర్కర్లకు గ్రాడ్యుటి అమలు చేయాలని చేసిన తీర్పు అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, గ్రాడ్యుటీఅమలు చేయాలని, మినీ సెంటర్ లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ వెంటనే జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. మహా ధర్నాలో అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కో- కన్వీనర్ పి.సి. కొండయ్య అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బద్వేల్ ప్రాజెక్టు గౌరవాధ్యక్షులు కోడూరు సుభాషిని, ప్రధాన కార్యదర్శి ఆర్. హుస్సేనమ్మ, ప్రాజెక్టు నాయకులు జయప్రద, రత్నమ్మ,కె.వి. సుభాషిని, విజయమ్మ, జయప్రద,వాణి, సరోజ, వసంతమ్మ, లక్ష్మీ నరసమ్మ, సుధ, శారదా, లీలావతి, అనురాధ, సులోచన, హసీనా, శ్రీదేవి పాల్గొన్నారు.

సమష్టి సహకారంతో వైవీయూ అభివృద్ధికి కృషి

- నూతన విసి ఆచార్య పి.ప్రకాష్ బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

బాధ్యతలు స్వీకరిస్తున్న విసి ప్రకాష్‌బాబు

విశ్వవిద్యాలయ సమగ్ర ప్రగతిని దృష్టిలో ఉంచుకొని అందరి సహకారంతో అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు శాయశక్తుల కృషి చేస్తానని యోగివేమన విశ్వవిద్యాలయం నూతన విసి ఆచార్య ఫణితి ప్రకాష్‌బాబు పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ బయో టెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్న ఫణితి ప్రకాష్ బాబును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైవీయూ విసిగా నియమించిన విషయం తెలిసిందే. ఆయన సోమవారం విసి ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, వై ఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపల్ రమణయ్య, డీన్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు స్కాలర్లు పుష్పగుచ్చాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన విసి మాట్లాడుతూ విశ్వ విశ్వవిద్యాలయాన్ని అధ్యయనం చేసి ప్రభుత్వ సహకారంతో నిధులను తెస్తా మన్నారు. బోధన పరిశోధన అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుంటామని స్పష్టం చేస్తూ పరిశో ధనలు ఆగిపోతే ప్రగతి ఉండదన్నారు. ఈ విశ్వవి ద్యాలయంలో భాగమైనందుకు తాను చాలా సంతోషంగా ఉన్నానని చెప్పారు. విద్యార్థు కలలను , ఆకాంక్షలను నెరవేర్చడం వారిలో ఆత్మవిశ్వాసాన్ని మెరుగుపరచడం చేస్తామన్నారు. పాలకమండలి సభ్యులతో భేటీ అయ్యారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వారి సహకారాన్ని కోరారు. అనంతరం డీన్లు, వివిధ విభాగాల డైరెక్టర్లతో సమావేశమయ్యారు. పరిపాలనలో మీ పాత్ర కీలకమని విశ్వవిద్యాలయ కీర్తిని పెంచే నిర్ణయాలు స్వేచ్ఛగాతీసుకోవాలన్నారు. విద్యార్థుల అభివృద్ధి కోసం ఎలాంటి మార్పులు, నిర్ణయాలు తీసుకునేందుకు తాను సిద్ధమన్నారు. విసి గా బాధ్యతలు స్వీకరించిన ప్రకాష్‌బాబుకు పూర్వపు ఇన్‌ఛార్జి విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ పి.సరిత, వివిధ విభాగాల డీన్లు ఆచార్య ఏజి.దాము, ఆచార్య రమాదేవి, ఆచార్య వై.సుబ్బరాయుడు, ఆచార్య చంద్ర ఓబుల్ రెడ్డి, ఆచార్య రఘు బాబు, డైరెక్టర్లు లక్ష్మీ ప్రసాద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావు, సిపి బ్రౌన్ గ్రంథాలయ విశ్వవిద్యాలయ సంచాలకులు ఆచార్య పార్వతి, పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, ఆచార్య చంద్రమతి శంకర్, డాక్టర్ మాదక్క, బేగం,డాక్టర్ ప్రమోద, అధ్యాపకులు విద్యార్థులు స్కాలర్లు అభినందనలు తెలియజేశారు.

సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -కడప అర్బన్ : ఎస్‌సి, ఎస్‌టి సముదాయాల సామాజిక-ఆర్థిక అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే ప్రయత్నాలను తాము సవినయంగా స్వాగతిస్తున్నామని, ప్రస్తుత పరిస్థితుల్లో బ్యాంక్ లింకేజీ లేకుండా 85శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కైపు రామాంజనేయులు కోరారు. సోమవారం జెసికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిలేని ప్రతి దళిత కుటుంబానికి 3 ఎకరాలు కేటాయించాలని కోరారు. 2025-2026 రాష్ట్ర బడ్జెట్లో స్థానం పొందేలా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ చర్యలు దళిత సముదాయాల జీవన స్థితిగతుల్లో విప్లవాత్మక మార్పును తీసుకువస్తాయని పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన జెసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం యూత్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు కైపు బాబు పాల్గొన్నారు.

తేక్వాండోలో 'కేశవరెడ్డి' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కడప అర్బన్: నగరంలోని ఔట్ డోర్ స్టేడియంలో నిర్వహించిన 3వ ఇంటర్ క్లబ్ తేక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీలలో స్థానిక చెముమియాపేటలోని కేశవరెడ్డి రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. 18 గోల్డ్ మెడల్స్, 10 సిల్వర్ మెడల్స్ సాధించి ట్రోఫీని కైవసం చేసుకున్నారు. చైర్మన్ కేశవరెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎజిఎం శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. విజయం అధించిన మాస్టర్ వసిం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాగజ్యోతి, డీన్ ద్వారకనాథ్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులు ఆందోళనకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు సిద్ధం కావాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.విజయభాస్కర్, కోశాధికారి గోపీ, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత పాలకులు ఆప్కాస్‌ను రద్దు చేసి ఏజెన్సీలకు ఇవ్వాలనే ఆలోచన విరమించుకుని, పర్మినెంట్ చేయాలని తెలిపారు. కరోనాకాలం మున్సిపల్ వర్కర్ల పాత్ర అమోఘమని పేర్కొన్నారు. అలాంటి మున్సిపల్ వర్కర్లను ఏజెన్సీలకు ఇవ్వాలని నిర్ణయించడం దారుణమన్నారు. కనుక స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రం అందజేయాలని పేర్కొన్నారు. మార్చి 5న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలిపారు.

త్వరలో వైసిపి కనుమరుగు

ప్రజాశక్తి - కడప అర్బన్ : దమ్ము ధైర్యం గురించి అవినాష్‌రెడ్డి మాట్లాడటం విడ్డూరంగా ఉందని, ప్రజలు తిరస్కరించిన ఇంకా సిగ్గు రాలేదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ అన్నారు. సోమవారం హరి టవర్స్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష హోదా గురించి జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీలో రాద్ధాంతం చేయడం సిగ్గుచేటన్నారు. ప్రతిపక్ష హోదా ప్రజలిస్తే వస్తుందని, కేకలు వేస్తే రాదని పేర్కొన్నారు. మాట తప్పను మడమ తిప్పను అనే జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్ష హోదా ఇవ్వనం తవరకు అసెంబ్లీకి వెళ్ళను అని చెప్పిన ఆయన అసెంబ్లీకి ఎలా వెళ్లాడని ప్రశ్నించారు. పులివెందుల ఉప ఎన్నిక వస్తుందని పులివెందుల ప్రజలు ఎక్కడ తిరస్కరిస్తారో అని భయపడ్డాడని అన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదన్నారు

నాగార్జున మోడల్ స్కూల్‌లో ఘనంగా స్నాతకోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- కడప అర్బన్

పట్టాలు పొందిన విద్యార్థులతో విద్యా సంస్థల చైర్మన్, డైరెక్టర్లు

నగరంలోని మారుతి నగర్‌లో ఉన్న నాగార్జున మోడల్ స్కూల్‌లో సోమవారం స్నాతకోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ ఎం.శివ శంకర్ రెడ్డి, డైరెక్టర్లు శ్రీదేవి, ఎం.భానేష్ సాయి రెడ్డి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన, ప్రార్థన గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రీ ప్రైమరీ స్కూలులో కిండర్ గార్డెన్ పూర్తి చేసిన చిన్నారులకు కాన్విగేషన్ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శివ శంకర్ రెడ్డి మాట్లాడుతూ చిన్నారులు ఒత్తిడికి లోను కాకుండా ఆడుతూ పాడుతూ ఉత్సాహంగా నేర్చుకునే విధంగా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. క్లిష్టమైన విషయాలను కూడా సులువుగా నేర్చుకుంటారని చెప్పారు. సర్వతో ముఖాభివృద్ధికి అనువైన వసతి, ఆధునిక సాంకేతికత బోధనా పద్ధతి అనుసరిస్తున్నామని పేర్కొన్నారు. వారి ఉజ్వల భవిష్యత్తుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇంతటి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కృషిచేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చిన్నారుల నృత్యాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ప్రైమరీ, హై స్కూల్ ప్రిన్సిపల్ సమీరా, కృష్ణవేణి, వివిధ పాఠశాలల యాజమాన్యం, శ్రేయోభిలాషులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏర్పాట్లపై సిబ్బందితో చర్చిస్తున్న ట్రైనీ డిఎస్‌పి భవాని

మహాశివరాత్రికి గట్టి బందోబస్తు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లి శ్రీవీరభద్ర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ట్రైనీ డిఎస్‌పి భవాని తెలిపారు. ఎస్ఐ చిన్న పెద్దయ్యతో కలిసి సోమవారం ఆమె ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్, ఇఒ శ్రీనివాసులతో కలిసి ఏర్పాట్లపై చర్చించారు. క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశం పరిశీలించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్ గురించి చర్చించారు. మైదుకూరు వైపు నుంచి వచ్చే వాహనాలను ప్రారంభంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో, చాపాడు వైపు నుంచి వచ్చే వాహనాలు కుందూనది సమీపంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశంలో నిలుపుదల చేయాలని నిర్ణయించారు. నలుగురు ట్రాన్స్‌కో సిబ్బందిని కూడా పండుగ మూడు రోజులపాటు దేవాలయం ఆవరణలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నట్లు ట్రాన్స్ కో శ్రీనివాసులురెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదా అడగడం అవివేకం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

తమకు ప్రతిపక్ష హోదా ఇవ్వాలని వైసిపి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గవర్నర్ ప్రసంగ సందర్భంగా నినాదాలు చేయడం, బహిష్కరించడం అవివేకమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. స్థానికంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అసెంబ్లీ నిబంధనలు, సంప్రదాయాల ప్రకారం ఒక పార్టీకి ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే మొత్తం అసెంబ్లీ సభ్యుల సంఖ్యలో 10 శాతం శాసనసభ్యులు ఆ పార్టీకి ఉండాలన్నారు. ఆ ప్రకారం వైసిపికి 18 మంది ఎమ్మెల్యేలు ఉండాలన్నారు. 11 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. రాష్ట్రం మద్యాంధ్ర, డ్రగ్స్ ఆంధ్ర, జూదం ఆంధ్ర, గంజాయి ఆంధ్రగా తయారైందని తెలిపారు. గవర్నర్ ప్రసంగం పిట్టల దొర ప్రసంగంలా ఉందని ఎద్దేవా చేశారు.

ఎలాంటి అవినీతి చేయలేదు

- పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గ్రామ పంచాయతీలో తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని కార్యదర్శి సుబ్బారెడ్డి తెలిపారు. స్థానికంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో అవినీతికి తాను పాల్పడినట్లు వచ్చిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. అధికారులు గ్రామ పంచాయతీపై విచారణ చేసిన విషయం వాస్తవమేనని, అవినీతి జరగ లేదన్నారు. పంచాయతీలో తన కంటే ముందు పని చేసిన అధికారులు కూడా అవినీతికి పాల్పడలేదని ఆయన పేర్కొన్నారు. పాలన పరంగా కొన్ని చిన్నచిన్న తప్పులు జరిగిన విషయం వాస్తవమన్నారు. అంతేతప్ప ఆర్థిక పరంగా ఎలాంటి నిధులు దుర్వినియోగం జర గలేదని వివరించారు. పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులకు చెక్కులు రూపంలో కాకుండా నగదుగా ఇవ్వడంతో అవినీతి జరిగినట్లు అరోపణలు వస్తున్నట్లు తెలిపారు. జీతాలు ప్రతి నెల ఉద్యోగులకు ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్థి కంగా అవినీతి జరిగి ఉంటే ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి ఉండదన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ జోసెఫ్ హైస్కూల్ 1996 విద్యార్థుల సహ కారంతో ప్రభుత్వ పాఠశాలలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. అనిబిసెంట్ మున్సిపల్ మున్సిపల్ హైస్కూల్‌లో 10వ పదవ తరగతి చదువు తున్న 98 విద్యార్థులకు కూడా అందజేశారు. సెయింట్ జోసెఫ్ 1996 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ శ్రీరంజన్ సహకారంతో మూడేళ్ల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమానికి 1996 బ్యాచ్‌కు చెందిన తన మిత్రుల సహాయం చాలా ఉందని ఆ సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎంఇఒ సావిత్రి మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా ఏకాగ్రహతతో పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవాధ్యక్షుడు చిప్పగిరి ప్రసాద్, ప్రధానోపాధ్యాయుడు గురప్ప మాట్లాడారు. ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ వారికి కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో ఉపా ధ్యాయుడు నాగరాజు, సంస్థ ప్రధాన కార్యదర్శి కుండా మాధవ, రాంబాబు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందిస్తున్న సంస్థ సభ్యులు

నేడు ప్రజ్ఞా వికాస్ పరీక్ష

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో మంగళవారం నిర్వహించనున్న ప్రజ్ఞా వికాస్ పరీక్షను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దుగ్గిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఆ మేరకు సోమవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఇఒ నాగస్వర్ణలతచే కరపత్రాలు ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో పరీక్ష జరగనుందన్నారు. కార్యక్రమంలో సత్య, నాగరాజు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - లింగాల

సాగు చేసిన అరటి పంటకు డ్రిప్ ద్వారా నీటి తడులు అందించేందుకు వెళ్లిన క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ వృద్ధ రైతును దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన మండల పరిధిలోని దిగువపల్లె గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. దిగువపల్లె గ్రామానికి చెందిన కొప్పూరు గంగిరెడ్డి (73) తన భార్య, కుంటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. వ్యవసాయం చేస్తూ వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజులాగా సోమవారం తనకు ఉన్న 5 ఎకరాల భూమిలో సాగు చేసిన అరటి పంటకు నీటి తడులు అందించేందుకు పొలం వద్దకు వెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు మారణాయుధాలతో కిరాతకంగా చంపారు. గంగిరెడ్డి ఇంటి రాకపోవడంతో పొలం వెళ్లి చూశారు. అక్కడ ఆయన రక్తపు మడుగులో చనిపోయి ఉన్నాడు. కుటుంబసభ్యులు భోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్య గల కారణాలను విచారిస్తున్నారు. ఎవరు.. ఎందుకు చంపారు అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని సిఐ రమణ, ఎస్ఐ మధుసూదన్ రావు తెలిపారు. మృతుడి కుమారుడు యోగానందరెడ్డి, కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గంగిరెడ్డి హత్యతో కలకలం రేపింది.

కలెక్టరేట్‌లో మలుపుల వద్ద, కార్ పార్కింగ్ వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారం

కలెక్టరేట్‌లో చెత్త.. పట్టని అధికారులు

- స్వచ్ఛ జిల్లా అంటే ఇదేనా?

ప్రజాశక్తి - కడప

నగరంలోని కలెక్టరేట్‌లో ఎటు చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు ఎప్పుడూ తిరిగే ప్రాంతంలో చెత్తచెదారం కన్పించడంపై సామాన్యులు పెదవి విరుస్తున్నారు. కలెక్టరేట్‌లోనే ఇలా చెత్తను ఇలా వదిలిసే అధికారులకు చిత్తశుద్ధి ఏముంటుందని విమర్శలు గుప్పిస్తున్నారు. స్వచ్ఛజిల్లాపై కేవలం జిల్లా ఉన్నతాధికారులు ప్రకటనలకే పరిమి తమని, చర్యలు శూన్యమని ఆరోపిస్తున్నారు. ఒక వైపు స్వచ్ఛ జిల్లాగా రూపొందించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా ఉన్నతాధికారి ఆదేశిస్తుంటే వారు పనిచేసే కార్యాలయ పరిసరాలు మాత్రం ఇలా చెత్తతో దర్శనమివ్వడం పలు విమర్శలకు తావిస్తోంది. కలెక్టరేట్‌లోని చెత్తనుచూస్తే అధికారులు ఆదేశాలు కేవలం మాటలకే పరిమితం అవు తున్నాయి తప్ప చేతల్లో కనిపించడం లేదని స్పష్టం అవుతుంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతా ధికారులు స్పందించి తగు చర్యలు తీసు కుంటారని కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు ఆశిస్తున్నారు.

అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల

క్రమబద్ధీకరణకు దరఖాస్తుల స్వీకరణ

మీ సేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల రెవెన్యూ డివిజన్ పరిధిలో అభ్యంతరంలేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా సులువుగా క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని ఆర్‌డిఒ చిన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి మీ సేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. జిఒ నెంబర్ 30ని అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం 2025 పేరిట భూముల క్రమబద్ధీకరణ చేపడతామన్నారు. ఈ ఏడాది డిసెంబరు 31 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని ఆయన పేర్కొన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తామన్నారు. ఆ మేరకు లబ్ధిదారులకు పట్టా, కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ చేస్తామని వివరించారు. తమ పూర్తి వివరాలను నిర్దేశించిన ధృవీకరణ పత్రాలతో మీసేవ ద్వారా అప్ లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. 2019 అక్టోబరు 15న ప్రమాణిక తేదీగా తీసుకుని ఆ తేదీ కంటే ముందు ఆక్రమణలో ఉన్న భూములను నిబంధనలు అనుసరించి క్రమబద్ధీకరిస్తామన్నారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు సైతం చెల్లించక్కర్లేదని తెలిపారు. 151 నుండి 300 గజాలలోపు దారిద్రరేఖకు దిగువను ఉండి ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాల్సి ఉంటుందన్నారు. దారిద్రరేఖకు ఎగువన ఉన్న వారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. 300 నుండి 450 గజాల పరిధిలో బిపిఎల్ కుటుంబాల వారు వందశాతం బేసిక్ ధర, 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలి. ఇదే విభాగంలో దారిద్రరేఖకు ఎగువన ఉన్న వారు 200శాతం బేసిక్ ధర, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు కట్టవలసి ఉంటుంది. 450 గజాలకు మించిన ఆక్రమణలో ఎవరు ఉన్నప్పటికీ బేసిక్ ధరకు ఐదు రెట్లు, వందశాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవలసి ఉంటుంది. అందుకు సిద్ధంగా లేకుంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు. లే అవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, జల వనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ చేయబోరని పేర్కొన్నారు. ఆర్‌సీసీ రూఫ్, ఆస్ బెస్టాస్ రూఫ్ ఇటుక గోడలతో నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఆస్తిపన్ను చెల్లింపు, విద్యుత్, వాటర్ బిల్లులను పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఇప్పటికే స్వీకరించి, పెండింగులో ఉన్న దరఖాస్తులనూ పరిగణనలోకి తీసుకుంటామన్నారు. తహశీల్దార్ల పర్యవేక్షణలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఆక్రమణలు జరిగిన ప్రాంతాలు పరిశీలిస్తారన్నారు. అనంతరం అర్హత కలిగిన లబ్ధిదారుల జాబితాను గ్రామ, వార్డు కార్యాలయాల్లో ప్రదర్శిస్తారని, అభ్యంతరాలు స్వీకరించి తహశీల్దార్లు తుది జాబితాను సబ్ కలెక్టర్, ఆర్‌డిఒకు పంపిస్తారన్నారు. సబ్ డివిజన్ లెవెల్ అప్రూవల్ కమిటీ ప్రకటించిన అర్హుల జాబితాపై అభ్యంతరాలు ఉంటే జాయింట్ కలెక్టరుకు 30 రోజుల్లోగా అప్పీలు చేసుకోవచ్చున్నారు. అర్హుల జాబితా ఖరారైన తర్వాత ఆ వివరాలను తహశీల్దార్లు ఆ ప్రాంత సబ్-రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లకు పంపుతారని, చివరి నిమిషం వరకు వేచి చూడకుండా అర్హులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌డిఒ కోరారు.

అర్హులు : గరిష్టంగా గ్రామాల్లో నెలకు రూ.10,000, పట్టణాల్లో నెలకు రూ.12,000 ఆదాయం ఉన్నవారు. నెలకు రూ.300లోపు విద్యుత్ ఛార్జీల చెల్లింపుదారులు. వ్యవసాయ భూమి 10 ఎకరాలు మెట్ట లేదా 3 ఎకరాలు మాగాణి లేదా రెండు కలిపి 10 ఎకరాల మించకుండా ఉన్న వారు.

అనర్హులు : లబ్ధిదారులు, కుటుంబసభ్యులు ఐటి చెల్లింపుదారై ఉండకూడదు. నాలుగు చక్రాలు వాహనం కలిగి ఉండకూడదు. టాక్సీ, ఆటో, ట్రాక్టర్లకు మినహాయింపు. కుటుంబ సభ్యులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులై ఉండకూడదు. కాంట్రాక్టు ఉద్యోగులు అనర్హులు.

సమస్యల పరిష్కారం కోరుతూ పోస్ట్‌కార్డు ఉద్యమం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) ప్రొద్దుటూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘ గౌరవాధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. నేటి ధరలకు అనుగుణంగా వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు ఇవ్వాలన్నారు. 200 మంది కార్మికులు కార్డులు రాశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయకుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవేంద్ర, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, ఉపాధ్యక్షులు గుర్రమ్మ, ప్రమీలమ్మ, రమాదేవి, నీతమ్మ, శాంతి, అన్నపూర్ణ, నరసమ్మ, మరియమ్మ, మోహన్, సహాయ కార్యదర్శులు నాగేంద్ర, శ్రీకాంత్, ఓబయ్య, రవి, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి దేవిడ్, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, సిఐటియు నాయకులు శేఖర్ పాల్గొన్నారు.

పోస్ట్‌కార్డు ఉద్యమంలో కార్మికులు

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి : సిఐటియు

కరపత్రాలు విడుదల చేస్తున్న విజయ్, అంగన్‌వాడీ టీచర్లు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అంగన్వాడీలకు వేతనాలు పెంచి, గ్రాట్యుటీ అమలు చేయాలని కోరుతూ మార్చి 10న చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు కార్యదర్శి దాసరి విజయ్ పిలుపునిచ్చారు. మైలవరంలోని మ్యూజియం వద్ద సోమవారం ఆయన కరపత్రాలను అంగన్వాడీ టీచర్స్ యూనియన్ నాయకులతో కలిసి విడుదల చేశారు. అనంతరం విజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న అంగన్వాడీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి కూటమి అధికారం చేపట్టిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు అవుతున్నా ఇంతవరకు ఆ సమస్యలను పరిష్కరించలేదన్నారు. ఐసిడిఎస్ ఏర్పడి 50ఏళ్లు పూర్తయిందన్నారు. అంగన్వాడీలకు కేంద్ర ప్రభుత్వం 2014 నుండి వేతనాలు పెంచలేదన్నారు. 2022లో సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రాట్యూటీ అమలు చేయాలని ఇచ్చిన తీర్పు ఇంకా అమలు చేయలేదన్నారు. సుప్రీంకోర్టు ప్రకారం పనికి తగ్గ వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్తల డిమాండ్స్ నెరవేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు ఎ.వినయ్ కుమార్, సిఐటియు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యలపై మార్చి 10న విజయవాడలో జరిగే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జమ్మలమడుగు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జి.ఏసుదాస్, కార్యదర్శి భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. పట్టణంలోని పిఆర్ హైస్కూల్ ఆవరణలో మహా ధర్నా కరపత్రాలను అంగన్వాడీలతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

అస్తవ్యస్తం.. గ్రామీణ అనుసంధాన రోడ్లు

ప్రజాశక్తి - చాపాడు

కడప-కర్నూలు ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న అప్రోచ్ రోడ్లు పలుచోట్ల అధ్వానంగా ఉన్నాయి. ముఖ్యంగా మైదుకూరు వద్ద సర్వాయపల్లి మసీదు రోడ్డు నుండి హైవేకు వచ్చే ప్రదేశం చాలా అధ్వాన్నంగా ఉంది. రోడ్డు మొత్తం గుంతలతో ఉంది. ప్రయాణికులు హైవే పైకి రావాలంటే ఇబ్బంది పడుతున్నారు. గత నెలలో పడిన వర్షానికి ఈ మార్గం చాలా అధ్వానంగా తయారైంది. చాపాడు మండల పరిధిలోని ద్వారకా నగరం, సిద్ధారెడ్డి పల్లి గ్రామాలకు వెళ్లే అనుసంధాన రోడ్డు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయి. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని హైవే రోడ్డు నిర్మించిన తర్వాత అనుసంధాన రోడ్లు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. దువ్వూరు మండలం గుడిపాడు వద్ద రోడ్డు అధ్వానంగా ఉంది. అనుసంధాన రోడ్డు వద్ద లైటింగ్ ఏర్పాటు చేస్తే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది. మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహదారి నుంచి కడప కర్నూలు ప్రధాన రహదారికి ఈ మధ్య కాలంలోనే అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేశారు. గతంలో ఈ మార్గంలో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడేవారు. ఈ ప్రాంతంలో ప్రస్తుతం సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రొద్దుటూరు రోడ్డు బ్రిడ్జి వద్ద సూచిక బోర్డు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. కడప-కర్నూలు ప్రధాన రహదారి నుండి అప్రోచ్ రోడ్లు, సూచిక బోర్డులు, లైటింగ్ వ్యవస్థను అభివృద్ధి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సిద్ధారెడ్డిపల్లె వద్ద అధ్వానంగా ఉన్న అప్రోచ్ రోడ్డు

కమిషనర్‌కు వినతిపత్రాన్నిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

కుక్కల బెడద తప్పించాలని డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలోని పలు ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువైందని, తప్పించాలని డివైఎఫ్ఐ నాయకులు సోమవారం మున్సిపల్ కమిషన్ మల్లికార్జునకు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజ్, పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందన్నారు. చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో వీధుల్లో వాహనదారులను కుక్కలు వెంట పడుతున్నాయని, ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. 7వ వార్డు ఎర్రన్న కొట్టాలలో ఒక చిన్నారిపై కుక్కలు దాడికి ప్రయత్నించాయన్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో కుక్కల నుండి ప్రజలను కాపాడాలని కోరుతున్నామన్నారు. కుక్కలను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో శేఖర్ పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న కమిషనర్, తూగుట్ల మధు

సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ పనులు పరిశీలన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా మున్సిపల్ కమిషనర్, అధికారులు, టిడిపి నాయకులు కృషి చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం సమ్మర్ స్టోరేజికి సంబంధించి పనులు ప్రారంభమయ్యాయి. 15వ ఫైనాన్స్‌కు సంబంధించి పనులు చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. దాదాపు రూ.70 లక్షలతో పనులు జరుగుతున్నాయి. ఈ పనులను మున్సిపల్ కమిషనర్ రాముడు, డిఇ చిదానంద రెడ్డి, ఎఇ వెన్నెల పరిశీలించారు. పులివెందులలో నీటి సమస్య తలైతకుండా ఉండేందుకు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిన్న రంగాపురం సుబ్బారెడ్డి, సారాయిపల్లి అంకాల్‌రెడ్డి, సిద్దయ్య, అక్రమ్, సుధాకర్‌రెడ్డి, నాయకులు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

రిజిస్ట్రీ రికార్డుల ఆమోదంపై అవగాహన

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతు రిజిస్ట్రీ రికార్డుల ఆమోదంపై స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం తహశీల్దార్ వరద కిషోర్‌రెడ్డి అధ్యక్షతన ఎఒ వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గ్రామ రెవెన్యూ సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సొంత పొలం కలిగిన రైతులకు గ్రామస్థాయిలో రిజిస్ట్రేషన్ చేసి గ్రామ రెవెన్యూ అధికారుల లాగిన్‌లో పునఃపరిశీలించాలన్నారు. ఆమోదం పొందిన తర్వాత తహశీల్దార్ లాగిన్‌లో పరిశీలించి ఆమోదిస్తారన్నారు. మండల వ్యాప్తంగా 3,105 మంది రైతులకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. రిజిస్ట్రేషన్ రికార్డులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సుదీప్, ఆర్ఐ లక్ష్మీ, టైపిస్టు మాధవి, విఆర్ఒ మునీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

రైతు సమస్యలపై సమగ్రమైన చర్చ జరగాలి

చాపాడు(మైదుకూరు) : అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో రైతు సమస్యలపై సమగ్ర చర్చ జరగాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ తెలిపారు. ఏడాదిగా రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన రైతులపై సమగ్రమైన చర్చ జరిపి వారిని ఆదుకోవాలని కోరారు. మైదుకూరు పట్టణ, మండల రైతు సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సర్కిల్‌లో జరిగిన నిరసన కార్యక్ర మానికి రమణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏళ్ల తరబడి రాయలసీమ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు రాజోలి, తెలుగుగంగ, జలదరాశి, హంద్రినీవా పూర్తికి నిధుల కేటాయించాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు, సమితి మండల కార్యదర్శి పాములేటి నరసింహ, సమితి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కె.రామ్మోహన్, చెక్‌పోస్ట్ శ్రీనివాసులు, షామీర్‌బాషా, పిండిమిషన్ సుబ్బరాయుడు, రామాంజనేయ రెడ్డి, బంగారు కొండయ్య, గోశెట్టి రాఘవ, సివి సుబ్బయ్య, తలారి సైమన్ పాల్గొన్నారు.

ఎంపిజె కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అబ్దుల్ ఖదీర్

బాధితులకు అండగా ఎంపిజె

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

బాధితులకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిజె అండగా ఉంటుందని ఆ సంఘ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ అబ్దుల్ ఖదీర్ పేర్కొన్నారు. సైదాగారివీధిలో సోమవారం ఎంపిజె రాయలసీమ ప్రాంతీయ కార్యాలయాన్ని అబ్దుల్‌ఖదీర్, రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ రజాక్ ప్రారంభించారు. అబ్దుల్ ఖదీర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా ప్రయత్నం చేస్తుందన్నారు. ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, 'సీమ' ఇన్‌ఛార్జి ఎండి అయూబ్ ఖాన్, జాకీం, హుస్సేన్ బాషా, రఫిక్, సభ్యులు రవి, అల్లాబకాష్ పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

వైఎస్ఆర్ జిల్లా, కడప నగరం, భాగ్య నగర్‌కాలని వాస్తవ్యులు, డోర్‌నెం.42/383-14, నివాసం ఉంటున్న చెన్నక్రిష్ణరెడ్డి గారి కుమారుడు డా॥ ఆరెం.శరత్‌కుమార్‌రెడ్డికి చెందిన పాస్‌పోర్ట్ 20.02.2025వ తేదీన జిరాక్స్ కోసం ఐటిఐ సర్కిల్ దగ్గరకు వెళ్తున్నప్పుడు మార్గమధ్యలో నాకు చెందిన ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెంబర్ **X4845679** పోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు గాని 89189138440 మొబైల్ నెంబర్‌కు గాని తెలుపగలరు.